# బిందుమాధవి

అక్కల సరస్వతీ బాబూరావ్



బిందుమాధవి చాలా అందమైనది. స్వర్ణకాంతులు వెదజల్లే ఆమె శరీరం గులాబీల సుకుమారత్వం కలిగి వుంటుంది. ఆమె నల్లని పెద్ద పెద్ద కళ్ళు మల్లెల చల్లదనాన్ని నింపుకుని వుంటాయి. చెరగని చిరునవ్వు ఆమె ముఖానికి మరో ప్రత్యేకత! గల గలా ఆమె మాట్లాడటం, కిలకిలా ఆమె నవ్వటం చూస్తుంటే కొండలమీద నుండి చిలిపిగా దూకుతూ ప్రవహించే సెలయేరు గుర్తుకు వస్తుంది. సుఖాలే తప్ప కష్టం మాట ఆమె వినలేదు. విషాదం, విచారం అంటే ఏమిటో ఆమెకు తెలియదు.

ఇవి బిందు మాధవి గురించి స్నేహితులకు, దగ్గర వారికి వున్న అభిప్రాయాలు.

అయితే ఆరు నెలల నుండి బిందులో ప్రత్యేక మైన మార్పు కనిపిస్తోంది. ప్రస్తుతం ఆమెను చూసిన వారెవరూ వెనుకటి బిందు అనుకోరు.

ఈ బిందు మళ్ళీ వెనుకటి బిందులా కాగలదా అని రోజుకు వందసార్లయినా అనుకుంటుంది ఆమె తల్లి. బిందు వివాహమై రెండు సంవత్స రాలు కావస్తోంది. పుటికి వచ్చిన బిందు ఆరు నెలలైనా అమ్మ దగ్గరే వుండిపోయింది.

సరిగ్గా ఇలాటి సమయంలోనే బిందు కుటుం బానికి అతి సన్నిహితురాలైన జలజ ఆ వూరు రావటం జరిగింది. వస్తూనే జలజ "లక్ష్మీ, నేను వచ్చేశాను. మాకు ఈ వూరు ట్రాన్స్‌ఫరైంది. మా వారు ఇల్లు చూసి నన్ను తీసుకు వస్తానన్నారు. నేనేమన్నానో తెలుసా? నాకా వూర్లో మరో ఇల్లు వుంది. నేనక్కడ దిగుతాను. మీరెక్కడ వున్నా నాకభ్యంతరం లేదు. ఇల్లు చూసి నన్ను తీసికెళ్ళండి'' అన్నాను. ఇంతహాయిగా మనసు విప్పి మాట్లాడుతున్న జలజను చూస్తున్న లక్ష్మి అంతరాంతాల్లో పేరుకుపోయిన స్తబ్దతకు చలనం కలుగుతున్నట్లు అనిపించింది. "ఏం మాట్లాడవే. కొంపతీసి వెళ్ళమనవు గదా! అన్నా నేను వెళ్ళనులే.''

"ఛ! అవేం మాటలే. ఇంతకూ ఆయనేరీ? నీకూ మీ వారికీ అభ్యంతరం లేకపోతే వేరే ఇల్లు చూసుకోకుండా యిక్కడే వున్నా నాకు సంతోషమే.''

"అది ఎలా కుదురుతుందిలే. ఈ ఇల్లు మీకు సరిపోతుంది. ఈ చిన్న ఇంట్లో రెండు కాపురాలు యెలా వుంటాం?'' ఈ మాటలన్న తర్వాత లక్ష్మి ముఖం చూసి చాలా బాధపడింది జలజ.

"సారీ లక్ష్మీ. క్షమించు'' అంది దిగులుగా.

"ఇట్సాల్ రైట్'' అంటూ లక్ష్మి లోపలి కెళ్ళింది.

ఆ సమయంలో వాళ్ళిద్దరి జ్ఞాపకాల్లో లక్ష్మి వాళ్ళు అమ్మివేసిన ఆధునిక సౌకర్యాలతో వున్న మూడంతస్తుల మేడ, చక్కటి తోట. కారు మెదిలాయి.

జలజ నిట్టూర్చి లక్ష్మి వెనకాలే వంటగదిలో కెళ్ళి ఆమె యిచ్చిన కాఫీ అందుకుంటూ ఇవతలి గదిలో పాపాయిని చూసింది.

"లక్ష్మీ, బిందు యిక్కడే వుందా?'' అడిగింది.

"ఆ. పాపాయి పుట్టిన తర్వాత యింకా వెళ్ళ లేదు.''

"ఇంట్లో లేదా?''

"వుంది. డాబామీదో, దొడ్లోనో యెక్కడో వంటరిగా వుండి వుంటుంది. ముందు కాఫీతాగు.'' లక్ష్మి గొంతులోని ఆర్ద్రతకు దెబ్బతిన్నట్లు చూసింది జలజ.

లక్ష్మి నీళ్ళు నిండిన తన కళ్ళను కనిపించ నీయకుండా వెనక్కు తిరిగింది. వారం రోజుల క్రితం బిందు పరిస్థితి బాగుండటం లేదని లక్ష్మి తనకు రాసిన ఉత్తరం గుర్తు వచ్చింది జలజకు.

బిందు వున్న ఇల్లు ఇంత నిశ్శబ్దంగా, నిస్తేజంగా వుండటం లక్ష్మి ఇంత దిగులుగా కనిపించటం, జలజకు ఆశ్చర్యాన్నే కాదు...ఆందోళనా కలిగించింది. అయితే ఇంతకు మించిన ఆందోళనా, ఆశ్చర్యం బిందు ఒంటరిగా డాబా మీద మూలగా కూర్చుని మోకాళ్ళలో తల పెట్టుకొని వెక్కి వెక్కి ఏడ్వటం చూసినప్పుడు కలిగింది. ఒక్క అంగలో దగ్గరకు వెళ్ళి "బిందూ" అంటూ ఆమె తలను గుండెలకు హత్తుకొంది.

జలజ కౌగిల్లో బిందు మరింత యేడుస్తూనే వుంది.

చాలాసేపటికి బిందు ఏడుపు ఆపింది. జలజ ఎంతో అప్యాయంగా అనునయిస్తూ అడిగింది.

"బిందూ. నీ బాధ యేమిటో చెప్పమ్మా. డాక్టర్లు నీకు జబ్బేమీ లేదంటున్నారు. మీయిద్దరికీ సరిపడటం లేదా?"

"ఊహు. అదేం లేదు."

"మరి ఎందుకా ఏడుపు? దిగులు!

"ఏమో నాకు తెలియదు. ఏదో భయం! బాధ! అదేమిటో తెలియదు. ఎందుకో తెలియదు. ఒక్కోసారి చనిపోవాలని ఎంతగానో అనిపిస్తుంది. కాని... మళ్ళీ ధైర్యం చాలదు."

"నేను వచ్చాగా ఇక నీకు భయం లేదు. ధైర్యంగా వుండు."

❋

పెళ్ళయిన తర్వాత బిందూ ఆమె భర్త ఇద్దరూ రెండుసార్లు పండుగలకు వచ్చి రెండు మూడు రోజులుండి వెళ్ళారు. మొదటిసారి నేనంత గ్రహించలేదు. కాని, రెండవసారి వచ్చినప్పుడు బిందులో మార్పు కనిపించింది. ఎక్కువగా మాట్లాడక పోవటం, నవ్వుతూ ఉండే మనిషి ఉదాసీనంగా వుండటం గమనించి అడిగాను. 'అబ్బే, నేను బాగానే వున్నానే' అంటూ నవ్వింది.

ఎంత చిలిపి వారైనా వివాహమైన తర్వాత కొందరిలో హుందాతనం వస్తుంది. బిందు విషయం అలాగే అనుకున్నాను.

పురిటికి తీసుకు రావడానికి నేను వెళ్ళినప్పుడు దాని ముఖంలో అమ్మను చూసిన సంతోషం నాకు కనిపించలేదు. భార్యాభర్తల మధ్య ఆత్మీయత లోపించినట్లు ఏదో అవసరం వరకే యిద్దరూ మాట్లాడుకుంటున్నట్లు నాకు అనుమానం కలిగింది. ఆ విషయమే అడిగితే "బాగానే వుంటాం" అంది.

పాపాయి పుట్టిన తర్వాత మనిషి పూర్తిగా మారిపోయింది. ఎవరితోనూ మాట్లాడదు. ఏదైనా అడిగితే పొడిగా సమాధానం చెపుతుంది. ఒక్కొక్కసారి ఒంటరిగా కూర్చొని విపరీతంగా ఏడుస్తుంది. మనం అనునయించిన కొలదీ దుఃఖం పెరుగుతుందే కాని తగ్గదు. ఎంత బ్రతిమిలాడినా, బుజ్జగించినా కారణం చెప్పదు. నేనెంతో ఓర్పుగా ఓదార్చాలని చూశాను. విషయం తెలుసుకోవాలని ప్రయత్నించాను. కాని...నా సహనానికే యిది పరీక్షగా వుంది. రెండు మూడు సార్లు విసిగిపోయి కోపగించుకొన్నాను. అప్పుడసలు అర్థం లేకుండా ఏదేదో అనేది. ఏమడిగినా భయం అంటుంది. ఆ భయం ఎందుకో యేమిటో తెలియదు. తిండి లేదు....నిద్రలేదు. శాంతి సౌఖ్యం అసలే లేదు."

పాపాయిని మంచంపై పడుకోబెట్టి దుప్పటి సరి

## శీఘ్రంగా వ్యాపిస్తున్న వార్త



చేసి పక్కగదిలోకి జలజను తీసికెళ్ళి ఆవేశంగా, బాధగా కళ్ళు తుడుచుకొంటూ లక్ష్మి చెప్పినదంతా శ్రద్ధగా విన్న జలజ, నిట్టూర్చింది.

"పాపాయిని కూడా చూసుకోదా?" అను మానంగా అడిగింది జలజ.

"లేదే. ఎదురుగా పాప యేడుస్తున్నా తనకేమీ పట్టనట్లు యెక్కడో చూస్తుంటుంది."

"ఈ విషయం నాకింత విపులంగా రాయలేదేం నువ్వు. రాస్తే వెంటనే వచ్చేదాన్ని. ఒక్కదానవు ఈ ఆరు నెలల నుండి యెలా ఓర్చుకోగలిగావు?"

"ముందుగా నీకే రాసి పిలిపించాలనుకున్నాను. కాని మీ వారి ఆరోగ్యం అంత బాగుండలేదని తెలిసి రాయలేదు."

"సరే. నేను వచ్చానుగదా, బిందు విషయం నేను చూసుకొంటాను. నువ్వు నిశ్చింతగా వుండు. రేపు ఆలోచిద్దాం. ఇక పడుకొందాం." అంటూ లేచింది జలజ.

కాని ఆ రాత్రి జలజా, లక్ష్మి కూడా నిద్ర పోలేదు.

కారణం...నిద్రమాత్రలు వేసినా బిందు లేచి కూర్చుని భయం...భయం...అంటూ యేడ్వటమే.

ఆ మర్రోజు బిందును తీసికొని డాక్టర్ సీత దగ్గరకెళ్ళింది జలజ. సీత తనకు బంధువు. బాగా చనువు. పైగా ఆమె సైక్రియాటిస్ట్.

"ఏమిటింత హఠాత్తుగా ఊడిపడ్డావ్." అంటూ ఆప్యాయంగా పలకరించింది సీత.

"నీకో పేషెంటును తీసుకొచ్చాను. నువ్వే బాగుచేస్తావో, ఎవరిచేతైనా బాగుచేయిస్తావో నీదే భారం!"

"అంత గడ్డుకేసా?" నవ్వింది సీత.

"నవ్వటం కాదు. చెప్పేది విను. మీ డాక్టర్లు దానికి జబ్బు లేదంటున్నారు. ఇదేమో అన్నం తినదు. నీళ్ళు త్రాగదు. నిద్రపోదు. ఎప్పుడూ 'భయం, భయం' అంటుంది. ఎవరో ఒకరు తోడుగా తన దగ్గరే వుండాలంటుంది. అలా తోడు వున్నా దానికి తృప్తిలేదు. దాని ముఖంలో కళ పోయింది. చూపులో ఏదో మార్పు వచ్చింది. కళ్ళల్లో ఆ వేదన: ముఖంలో దీనత్వం: నువ్వే చూస్తావుగా: సీతా, ఒకప్పుడు బిందు ఎంతో చలాకీగా, ఆనందంగా వుండేది."

"అయితే ఒక్క అయిదు నిమిషాలాగు. హాస్పటల్‌కు వెళ్దాం. అక్కడ అన్ని పరీక్షలు చేయవచ్చు."

ఆ తర్వాత బిందుకు అన్ని పరీక్షలు చేయటం, సర్జన్లకు చూపటం అన్నీ పూర్తి అయిన తర్వాత సీత అంది.

"జలజా. ఈ అమ్మాయికి శారీరకంగా యే జబ్బూ లేదని తేల్చేశారు డాక్టర్లు. ఇకపోతే యిది నేను చూడవలసిందే. నువ్వు సాయంత్రం ఆ అమ్మాయిని ఇంటికి తీసుకునిరా."

❋

"జలజా, నువ్వికక్కడే కూర్చో. బిందూ నువ్వు లోపలకు రామ్మా." ఇంటికి వచ్చిన జలజ, బిందులను చూసి అంది డాక్టరు సీత.

"బిందుతో నేనూ రాకూడదా?" అడిగింది జలజ.

"వద్దు. బిందుతో నేను మాట్లాడాలి."

"అయితే...."

"నువ్వుంటే ఆ అమ్మాయి తన మనసులోని మాట నిర్భయంగా చెప్పలేక పోవచ్చు."


# డై చేసుకోవడం ఇది వరకు ఎప్పుడూ ఇంత సులభంగా వుండలేదు.



గోద్రెజ్ వారి తనంతట తానే వ్యాపించే హేర్ డైతో డై చేసుకోవడం ఎంతో సులభం. ఎందుకంటే, మీరు వేసు కొంటూండగానే రంగు తనంతట తానే వ్యాపిస్తుంది. జుట్టు పాయలుగా విడదీసి, రంగు వేసుకొనే శ్రమ లేదు. ఎలాంటి బాదరబందీ లేదు.

**సురక్షితం కూడా**
గోద్రెజ్ హేర్ డై మీ జుట్టుపై కోమలంగా పని చేస్తుంది. ఇది, మీ జుట్టుకు ఏమాత్రం హాని కలిగించకుండా, సురక్షితంగా, చర్మం పైన మరకలు ఏర్పరచకుండా మెత్తగా రంగు వేయడానికై రూపొందించబడింది. ఇది హాయిగొల్పే సువాసనతో కూడినది మరియు జుట్టుకు మెరుపును, ఒత్తుదనాన్ని ఇవ్వడానికై ఇందులో ప్రత్యేకమైన కండిషనర్ కూడా వుంది.

**సహజవంతమైనది**
గోద్రెజ్ హేర్ డై రెండు చక్కటి సహజమైన రంగుల్లో లభిస్తుంది— నలుపు మరియు డార్క్ బ్రౌన్. ఇది వెంట్రుక మూలముల దాకా చొచ్చుకొని పోయి మీ జుట్టుకు సహజంగా గాఢమైన రంగును మరియు సహజ సౌందర్యాన్ని ఇస్తుంది.




**గోద్రెజ్ వారి తనంతట తానే వ్యాపించే హేర్ డై—**

**ఇప్పుడు డై చేసుకోవడం జుట్టును కడుక్కోవడం లాగే సులభం.**

CASGS-160-108 TEL

"ఆమె నీకైనా చెబుతుందా?"

"ఒకవేళ బిందు చెప్పలేకపోయినా 'పెంటోతాల్ ఎనాలిసిస్' వల్ల చెబుతుంది."

బిందు డాక్టర్‌కు ఎదురుగా కూర్చుంది.

"చూడమ్మా. నీ పేరు బిందు కదూ!"

"అవును. పూర్తి పేరు బిందుమాధవి."

"ఏం చదువుకున్నావ్?"

"ఎమ్. ఎస్సీ"

"ఇంత చదువుకున్నావ్? ఖాళీగా వున్నావా? ఏదైనా జాబ్ చేయాలని లేదూ."

"ఉంది డాక్టర్. కాని....కాని...."

"మీవారు ఒప్పుకోలేదా?"

"అసలు నేనాయన్ను అడగలేదు."

"ఏం అడిగినా ఒప్పుకోరనా?"

"ఆ. ఏమో తెలియదు" తడబడుతూ అంది.

"సరే. ఆ సంగతి వదిలేద్దాం. నీ మనసులో బాధేమిటో నాకు చెప్పమ్మా. ఎలాటి రహస్యమైనా ఫర్వాలేదు. నా నుండి మరొకరికి తెలియదని మాటిస్తున్నాను."

కొంచెం ఆలోచించి అంది బిందు.

"నాకే తెలియటం లేదు డాక్టర్ ఊరికే యేడుపొస్తుంది. ఒక్కోసారి ఎంతో దుఃఖం కలిగినా కంట్లో నీరు రాదు. భయం....ఒకటే భయం! అది ఎందుకో తెలియదు. ఒక్కోసారి పెళ్ళికాక ముందు రోజులు గుర్తు వస్తాయి. అప్పుడు ఎంతో బాధగా వుంటుంది. ఈ బాధ భరించలేక చచ్చిపోవాలనిపిస్తుంది....డాక్టర్ ప్లీజ్ .... నన్ను రక్షించరూ?"

అమె అలా ప్రాధేయ పూర్వకంగా అడగటంలోనే ఆమె ఎంతటి మానసిక క్షోభ అనుభవిస్తోందో తెలుస్తోంది.

"చూడు బిందూ. నేనిప్పుడు 'పెంటోతాల్ ఎనాలిసిస్' చేస్తాను. మరేమీ భయం లేదు. నీకు నయమవుతుంది."

❋

ఒక గంట తర్వాత బయటకు వచ్చిన సీత దగ్గరకు ఆదుర్దాగా వచ్చింది జలజ.

"ఆమె ఎవరు జలజా."

"నా ఫ్రెండు కూతురు. దాని గురించి ఏమి చెప్పాలనుకున్నా నాకే చెప్పు."

**గోదాదేవి కథ!**

శ్రీవిల్లిపుత్తూరులో భూదేవి అంశగా జన్మించిన గోదాదేవినే 'ఆండాళ్' అని కూడా పిలుస్తారు. ఆమె విలిపుత్తూరు గుడిలోని వటపత్రశాయినే శ్రీకృష్ణునిగా, తన పరిసరాలను వ్రేపల్లెగా, తనను గోపికగా, తన చెలికత్తెలు గోపకన్యలుగా భావించి ధనుర్మాస వ్రతాన్నాచరించి అభీష్టసిద్ధి పొందింది. రంగనాథునిలో సంక్రాంతికి ముందు రోజున ఆమె లీనమైపోయింది. వారి కళ్యాణానికి చిహ్నంగా సంక్రాంతి పర్వదినం జరుపబడుతున్నట్లుగా కొందరు విశ్వసిస్తారు.

"ఆమెకు ఏ జబ్బులేదు. కేవలం మానసిక వ్యాధి. నేను మందులు ఇస్తాననుకో. కాని అంతకంటె ముఖ్యమైన విషయం – ఆమెను అత్యంత ప్రేమగా చూసుకోవాలి. జీవితం అంటె భయం లేదని, ఈ ప్రపంచంలో తనకంటె హీనస్థితిలో వున్నవారు ఎంతో ఆనందంగా, సుఖంగా జీవిస్తున్నారని ఆమె తెలుసుకోవాలి. ఆమె భర్త వస్తే ఒకసారి నా దగ్గరకు తీసుకునిరా. అతడితో మాట్లాడాలి."

"సీతా....నాకేమీ అర్థం కావటం లేదు. దానిని అందరూ ప్రేమగానే చూస్తారు."

"ముందీ విషయం చెప్పు జలజా. బిందు వాళ్ళు ఒకప్పుడు బాగా ధనవంతులు గదూ."

"ఒకప్పుడేమిటి? రెండేళ్ళక్రితం వరకూ చాలా దర్జాగా వుండేవాళ్ళు. ఒక్కసారిగా వాళ్ళనాన్నకి వ్యాపారంలో నష్టం వచ్చి అంతా పోయింది. అప్పుడే బిందు వివాహం చేయాగలనో లేదోనని భయపడిపోయింది వాళ్ళమ్మ. చివరకు మిగిలిన వెండి, బంగారం అమ్మి బిందు పెళ్ళిచేసింది."

"అదే ఆమె చేసిన పొరపాటు. బిందును ఏదైనా ఉద్యోగంలో పెట్టి, ఆమెలో ఆత్మస్థైర్యం కలిగించి, ఆ జీవితానికి కొంతకాలం అలవాటుపడిన తర్వాత కష్టాల గురించి తెలిసికొనేటట్లు చేస్తే బాగుండేది."

"కాని బిందు ఎప్పుడూ పెళ్ళి వద్దు అనలేదు."

"అలా అనటానికి ఆ అమ్మాయి మనసేమిటో ఆమెకే తెలియదు. ధనవంతుల పిల్లగా పెరిగిన బిందులో అన్నీ ఖరీదైన ఆలోచనలే స్థిరపడిపోయినై. ఆమె యిలా తయారవడానికి తల్లికి కూడా బాధ్యత వుంది."

"అంటే...."

"ఆమె యెప్పుడూ బంగళా, దానిచుట్టూ తోట కారు....ఫోను....పనివాళ్ళు వీటన్నిటి మధ్య తనను అపురూపంగా చూసుకొనే భర్తా....ఆ ఇంట్లో తనమాటే వేదవాక్కని ఊహించుకొనేది. తల్లి కూడా అమెకు అలాంటి సంబంధమే తెస్తానని చెబుతూ వుండటంతో ఆమెలో ఆ ఊహ బలపడింది. ఒక రకమైన విలాస జీవితానికి అలవాటుపడి....ఆ స్థాయిలోనే తన జీవితాన్ని ఊహించుకొన్న బిందు ఆస్థిపాస్తులులేని సామాన్య గుమాస్తాను భర్తగా పొంది షాక్ తింది. అయితే ఇందులో మరో చిక్కు. భర్త ఆమెను ప్రేమగానే చూస్తాడు. కాకపోతే డబ్బుదగ్గర జాగ్రత్త మనిషి. ఇది రెండోషాక్. పైగా ఆ అమ్మాయిని సరదాగా తన వెంట బయటకు తీసికెళ్ళటం గాని,. సినిమాల కెళ్ళటం గాని చేయడు. అప్పుడప్పుడు చిన్నచిన్న బహుమతులు కాదుగదా పావలా పువ్వులు కూడా తెచ్చి ఆమె చేతిలో పెట్టడు. ఇది ఆమెకు మూడోషాక్.

"అందుకే ముఖ్యంగా ఆమె భర్తకు ఇవి అర్థమయ్యేలా చెప్పాలి. తక్కువ జీతాలలో ఆనందంగా బ్రతికే వారిని బిందుకు చూపించి, తనూ ఈ జీతంలో జీవించగలననే నమ్మకం కలిగించాలి, ఎందుకంటే ఆమెకు ఈ జీతంలో తామే బ్రతకలేరనీ, ఇంకా పాపనెలా పోషించుకోవాలనే బెంగ అంతర్గతంగా వుంది. ఇదీ విషయం. నీవే బాధ్యత వహిస్తావో, వాళ్ళ తలిదండ్రులకే చెబుతావో నీయిష్టం."

"థాంక్యూ సీతా. దాని బాధ్యత నేనే తీసుకొంటాను."

❋

ఆ తర్వాత ఆరు నెలలు జలజ దగ్గర వుండి నవ్వుతూ వచ్చిన బిందులో వెనుకటి చిలిపి బిందు కనిపించింది తల్లికి.

"నీ ఋణం యెలా తీర్చుకోనే జలజా" అంది లక్ష్మి కన్నీళ్ళతో.

"ఇందులో నేను చేసిందేమీ లేదు. బిందు భర్త చాలా సహకరించాడు." అంది తృప్తిగా.

డబ్బుంది గదా అని పిల్లలలో ఆశలు పెంచకూడదనే విషయం అప్పటికి గ్రహించి నిట్టూర్చింది లక్ష్మి. □